క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: మండల కేంద్రమైన భట్టిప్రోలులో సోమవారం మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ ఏడుకొండలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

నేడు తిరునాళ్ల నిర్వహణపై సమీక్ష

రేపల్లె: మహాశివ రాత్రిని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వర స్వామి ఆలయ తిరునాళ్ల నిర్వహణపై ఈ నెల 23వతేదీ సోమవారం ఉదయం 11 గంటలకు రేపల్లె పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి పి.రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ వీరవసంతరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో ఆయాశాఖల అధికారులు హాజరై తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్షించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

యాజలి(కర్లపాలెం): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. యాజలి గ్రామానికి చెందిన దామర్ల బాబూరావు కుమారుడు గురుచరణ్ ఇటీవల విజయవాడలో విద్యుత్ షాక్ తగిలి గాయాలతో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం బాపట్ల మాజీ సైనికుల సంక్షేమ సంఘం తరపున తాండ్ర సాంబశివరావు రూ.6,500 గురుచరణ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యాజలి గ్రామ కమిటీ అధ్యక్షుడు పేరాల వెంకట సురేష్, నాయకులు శ్యామ్‌బాబు, తాండ్ర శ్రీరామ్, పల్లప్రోలు ఏడుకొండలున్నారు.

దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ



తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బూరెల దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పరామర్శించారు. దుర్గాప్రసాద్ మాతృమూర్తి బూరెల జయలక్ష్మి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి డాక్టర్ నాగార్జున ఆదివారం ఇక్కడి నాజరుపేటలోని వారి స్వగృహానికి వెళ్లారు. వివరాలను తెలుసుకుని తమ సానుభూతిని తెలియజేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



తెనాలి: స్థానిక టీబీ రోడ్డులోని శ్రీవిరాట్ విశ్వకర్మ దేవస్థానంలో ఆదివారం సాయంత్రం విశ్వకర్మ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యనిర్వహణ అధికారి వెంకట నాగ మల్లేశ్వరి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. అన్న ప్రసాదవితరణ జరిగింది. నందులపేటలోని వేదపాఠశాల విద్యార్థులు వేద మంత్ర పఠనం చేశారు. చైర్మన్ నూతలపాటి సురేష్, అర్చకుడు నారాయణస్వామి పాల్గొన్నారు. ఈఓ మల్లేశ్వరి పర్యవేక్షించారు.

బుర్రకథ కళాకారుడు గంటయ్యకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో ఆదివారం చాణక్య చంద్రగుప్త చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. సోమవారం ఒకే కుటుంబం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ బుర్రకథ కళాకారుడు, గాయకుడు జల్లి గంటయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేసన హనుమంతరావు, కేసన పిచ్చయ్య, కనపర్తి బెనహర్, పిల్లి ఆదిశేషు, జి.వేమయ్య, పినపాటి రవికుమార్, పెమ్మసాని పోతురాజు, అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

మంగళగిరి: పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో ఓ పేద విద్యార్థికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నగరంలోని పోలేరమ్మ గుడి వద్ద పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘ కార్యాలయంలో ఆదివారం నగరానికి చెందిన జంజనం అనుదీప్ అనే బీటెక్ విద్యార్థికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. సంఘం ప్రధాన కార్యదర్శి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామర్ల కుబేరస్వామి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- అమర్తలూరులో గడప గడపకు మన ప్రభుత్వం



అమర్తలూరులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

అమర్తలూరు(వేమూరు): సంక్షేమ పథకాలను మహిళలకు నేరుగా అందజేస్తూ, ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో మహిళలకు పెద్దపీట వేయడంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఆయన చెప్పారు. ఒక్క సంక్షేమ పథకాలు అందజేయడమే కాకుండా, రాజకీయంగా అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతూ, ప్రజా సంక్షమమే పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, చందోలు డేవిడ్ విజయకుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, కో-ఆప్షన్ మెంబరు అరమళ్ల మాణ్యికం, గ్రామ సర్పంచి దేవరకొండ రాము, సొసైటీ అధ్యక్షులు యలవర్తి సురేష్, చదలవాడ రమేష్, బర్మా ప్రవీణ్ కుమార్, దోవా రవీంద్రబాబు, పోతర్లంక సురేష్, కొండముది భాస్కర్, షేక్ హుస్సేన్ వలీ, నూతక్కి శంకర్, మండే కోటేశ్వరరావు, మానుకొండ దానియేలు, అమర్తలూరు వెంకయ్య, అంబటి రామోహనరావు, కొండపల్లి కిరణ్‌బాబు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి శుక్లాల ఆపరేషన్‌కు 109 మంది ఎంపిక



ఉచిత కంటివైద్య శిబిరానికి బారులు తీరిన వృద్ధులు

చెరుకుపల్లి: ఉచిత కంటి శిబిరంలో 225 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 109 మంది కంటి ఆపరేషన్‌లకు ఎంపికైనట్లు శంకర కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ దివ్యభార్గవి తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెద కాకాని శంకర కంటి ఆసుపత్రి చెరుకుపల్లి వాసవి క్లబ్, వాసవిక్లబ్ వనిత, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని వాసవి క్లబ్ సీనియర్ నాయకులు తుమ్మల వెంకట సాయి నాగభూషణం ప్రారంభించారు. ఉదయం 9 గంటలనుంచి రెండు గంటలవరకు జరిగిన శిబిరంలో 225మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 109మంది కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వారికి ఉచితంగా వైఎస్సార్ వైద్యసేవ పథకం ద్వారా వరుసగా 22 తేదీన 50మందికి 23వ తేదీన 50 మందికి 24వ తేదీన మరో తొమ్మిది మందికి ఆపరేషన్‌లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు కోనుగుంట్ల జయంత్ కుమార్, ఆలపాటి సుధారాణి, కాశేపల్లి గౌరి శంకర్, అన్నవరపు సంచిత, బైసాని అశోక్ కుమార్, వైద్యులు డాక్టర్ దివ్యశంకర్, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న చందోలు బండ్లమ్మవారు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు ఆశ్రయం అభినందనీయం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కమిషనర్ భానుప్రతాప్

పేరలి(కర్లపాలెం): వృద్ధులకు ఆశ్రయం కల్పించటం అభినందనీయమని బాపట్ల పురపాలక సంఘం కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. పేరలి గ్రామంలో ఏపూరి బ్రదర్ హుడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని బాపట్ల పురపాలక సంఘం కమిషనర్ భానుప్రతాప్ ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా కమిషనర్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన భోజనాన్ని వృద్ధులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న ఏపూరి బ్రదర్స్‌ను కమిషనర్ భానుప్రసాద్ అభినందించారు. ఏపూరి బ్రదర్స్ హుడ్ ట్రస్ట్ చైర్మన్ ఏపూరి బాబూరావు, అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు జి.మీరయ్య, ఎం.శివరావు, నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చేనేత హస్తకళల ప్రదర్శన



బాపట్ల: బాపట్ల పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ హ్యాండ్‌లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రదర్శన ఆకట్టుకునే విధంగా నిలిచాయి. ప్రదర్శనను జడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేరు రాణి ప్రారంభించారు. పోచంపల్లి, నారాయణ్ పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారీ, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్ బెంగాల్ సిల్క్ వంటివి ప్రదర్శనకు ఉంచారు. భావనారుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి ఆర్గనైజర్ సింహాద్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్సంగ కేంద్ర వార్షికోత్సవం



సాయినాథునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రం 31వ వార్షికోత్సవం వైభవంగా జరుగుతోంది. వేడుకల్లో భాగంగా బుర్రిపాలెం రోడ్డులోని వీజీకే కల్యాణ మండపంలో ఆదివారం సాయినాథుని ఉత్సవమూర్తులను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించి పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు నిర్వాహకులు బాబా భజనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం షిరిడీ సాయిబాబా నృత్య రూపకాన్ని నటరాజ నృత్య కళానికేతన్ బృందం సభ్యులు ప్రదర్శించారు. అనంతరం హారతి, ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం కుమారి నోరి లక్ష్మీచే సంగీత కచేరీ జరిపారు. సాయి స్వచ్ఛరిత్ర నుంచి సత్సంగంను బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తి నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని కన్వీనర్ వీఎస్ నాగభూషణ రెడ్డి పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, షేక్ మీరావలి, భక్తులు పాల్గొన్నారు.

హరికృష్ణకు డీఈఓ సన్మానం



ఆంగ్లోపాధ్యాయుడు హరికృష్ణను సన్మానిస్తున్న డీఈఓ రామారావు, ఎంఈఓ

ఐలవరం(భట్టిప్రోలు): రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా విదేశాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులతో వర్చువల్ క్లాసుల ద్వారా మాట్లాడించడమే కాక పెన్‌పాల్ (ఉత్తర ప్రత్యుత్తరాలు) ద్వారా వారిలో ఆసక్తిని పెంపొందిస్తున్న భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ పచ్చారు హరికృష్ణను బాపట్ల విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ఘనంగా సన్మానించారు. శనివారం చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలో ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి గ్రాండ్ టెస్ట్‌లో భాగంగా హరికృష్ణను డీఈఓ తోపాటు భట్టిప్రోలు ఎంఈఓ పులి లాజర్, ఏపీఎస్ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం మురళీమోహన్ వివిధ హైస్కూళ్ల హెచ్‌ఎంలు కాటూరి లక్ష్మీన్నారాయణ, కనపర్తి నిరీక్షణరావు, తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

మానవాళికి సోషలిజాన్ని చూపించిన లెనిన్



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గురుబ్రహ్మం, బొల్లిముంత కృష్ణ తదితరులు

తెనాలి: ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదంపై జరిగే పోరాటానికి వీఐ లెనిన్ చూపిన బాట నేటికీ దిక్సూచీలా కొనసాగుతోందని 'ఇస్కఫ్' తెనాలి డివిజన్ అధ్యక్షుడు, ఏఐటీయూసీ తెనాలి అధ్యక్షుడు ఎస్.గురుబ్రహ్మం అన్నారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ సంస్థ కార్యాలయంలో ఆదివారం లెనిన్ 99వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. గురుబ్రహ్మం మాట్లాడుతూ సోషలిజం ఎలా ఉంటుందో మానవాళికి ఆచరణలో చూపించిన మహోన్నతుడు లెనిన్‌గా చెప్పారు. అధ్యక్షత వహించిన బొల్లిముంత కృష్ణ లెనిన్ జీవిత విశేషాలను తెలిజేశారు. ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి మునిపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తిగా సంస్థ కార్యకలాపాలు కొనసాగుతాయని చెప్పారు. ఏఐటీయూసీ నాయకులు జి.వెంకటేశ్వరరావు, బి.శివశ్రీనివాసరావు, కె.ప్రవీణ్, బోయపాటి నాగరాజ, కె.రమేష్, డి.నాగరాజు, రవి పాల్గొన్నారు.

సమ్మోహనం.. గానామృతం



చావా నరసింహారావును సత్కరించిన సాయి లక్కరాజు, గాయనీగాయకులు

తెనాలి: తెలుగు సినిమా పరిశ్రమకు రెండు కళ్లుగా వెలిగిన నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు. దశాబ్దాల పాటు తమ నటప్రతిభతో సినీప్రేక్షకుల హృదయాల్లో ఆరాధ్య దైవాలయ్యారు. నటరత్న, నటసామ్రాట్‌లైన ఆ ఇద్దరు మహానటులను స్మరించుకునేలా 'సూర్యచంద్రులు' పేరుతో తెనాలిలో జరిగిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహుతులను అలరించింది. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో కొత్తపేటలోని శ్రీరామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఆదివారం సాయంత్రం సినీసంగీత విభావరిని నిర్వహించారు. ఆపాతమధురాలైన పాటలను ఆ మాధుర్యం చెక్కుచెదరని రీతిలో గాయనీ గాయకులు గాన కౌశలాన్ని చాటారు. గానామృతంతో ప్రేక్షకుల్ని సమ్మోహితులను చేశారు. స్వరలయ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు వ్యాఖ్యాతగా, సమయోచిత సంభాషణలతో సంగీత విభావరి రెండున్నర గంటలకు పైగా ఎన్టీఆర్, ఏఎన్నార్ అభిమానులను అలరించింది. విజయవాడ డ్రీమ్ ఆడియోస్ అధినేత చావా నరసింహారావును సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. గాయనీ గాయకులు సత్యవర్ధన్, రసూల్‌బాబు, వాసిరెడ్డి శ్రీనివాస్, సుధారాణి, విష్ణుప్రియ, అమలారాణి ఆలపించిన గీతాలకు వినోద్, రమణ, వెంకట్, కమలాకర్ వాద్యసహకారం అందించారు. కార్యక్రమానికి విమల్, అఖిల్, సురేష్ తదితర మిత్రబృందం సహకరించింది.

ఘనంగా వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం



క్లబ్‌కు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి 23వ వార్షికోత్సవం ఆదివారం ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 2022 సంవత్సరానికి వాకర్స్ క్లబ్ తరపున ఉత్తమ వాకర్‌గా సూరపనేని రాంప్రసాద్, ఉత్తమ మహిళా వాకర్‌గా దాసరి వసుమతి, ఉత్తమ యోగసాధకులుగా వంగల జగదీశ్వరికి అవార్డులు బహూకరించి సత్కరించారు. తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్, ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అతిథులుగా హాజరయ్యారు. అవార్డుగ్రహీతలను సత్కరించారు. వాకర్స్‌క్లబ్ సేవలను అభినందించిన డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి క్లబ్‌కు రూ.50 వేల చెక్కును బహూకరించారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు వార్షిక నివేదిక సమర్పించారు.

తీరిన అన్నదాతల కరెంట్ కష్టాలు

- నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లు, 60 స్తంభాలు ఏర్పాటు
- థాంక్యూ సీఎం సార్ అంటూ రైతుల కృతజ్ఞతలు



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెబుతున్న రైతులు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండలం గోకరాజునల్లి బోయినవారిపాలెం గ్రామానికి చెందిన 20 మంది రైతులు అనాదిగా వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. అయితే రెండవ పంటగా సాగు చేస్తున్న వేరుశనగకు నీరందించాలంటే కిరోసిన్, డీజిల్ ఇంజిన్లపై ఆధారపడాల్సి వచ్చేది. దీంతో ఎకరానికి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. విద్యుత్ లైను ఏర్పాటు చేయాలని గత పాలకులు, అధికారుల చుట్టూ రైతులు అనేకమార్లు తిరిగినా, పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డి చొరవతో విద్యుత్ శాఖ సిబ్బంది నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి, 60 విద్యుత్ స్తంభాలతో కరెంట్ లైను వేసి 20 మంది రైతులకు విద్యుత్ మీటర్లు బిగించారు. దీంతో తమకు సాగు కష్టాలు తీరాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కష్టాలు తీర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, విద్యుత్ శాఖాధికారులకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈవిషయంపై విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసేందుకు రూ.16లక్షలు రాయితీ అందజేసినట్లు తెలిపారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కారం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



బేతపూడిలో వృద్ధుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ప్రాధాన్యత క్రమంలో అన్ని సమస్యలను పరిష్కారించుకుందామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని బేతపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు వారు పొందిన లబ్ధి వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే వెంటనే సంబంధిత సచివాలయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. సంక్షేమం ఒక వైపు, అభివృద్ధి మరోవైపు అనేవిధంగా పాలన కొనసాగుతుందని తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన..

బేతపూడి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో రోడ్డు పనులకు ఎమ్మెల్యే కోన రఘుపతి శంకుస్థాపన చేశారు. గ్రామంలో మరికొన్ని రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఆట్ల ప్రసాదరెడ్డి, కోటా వెంకటేశ్వరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధి బుద్ధి సమేత గణపతి దేవాలయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు తనయుడు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పంచాహ్నిక దీక్షతో ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ తిరునాళ్ళు ప్రారంభమయ్యాకే చుట్టుపక్కల ప్రాంతాలలో తిరునాళ్లలు జరుగుతాయి. దేవాలయ నిర్మాణానికి పాటుపడిన తాడికొండ వంశీయులు ఏటా క్రమం తప్పకుండా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రసిద్ధి గాంచిన పంచాయతన (5) దేవాలయాలు ఇక్కడ ఉండటం విశేషం. సోమవారం గ్రామ దేవత కట్లమ్మ తల్లికి నైవేద్యం చెల్లించి ధ్వజారోహణ చేస్తారు. ఉత్సవాలలో భాగంగా మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, స్వామివార్ల కల్యాణం, లక్ష్మి గణపతి హోమం, రథోత్సవం, వసంతోత్సవం, దేవీ భూదేవీ సమేత ఆదిశేషాచల స్వామి కల్యాణం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఎ' సర్టిఫికెట్ పరీక్షలు



పరీక్షలకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

రేపల్లె రూరల్: పట్టణంలోని మౌంట్‌ఫోర్ట్ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్, ఎ-సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్లటూరు, పెరవలి, ఐలవరం, మౌంట్‌ఫోర్ట్‌కు చెందిన 170 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో తెనాలి ఆంధ్ర బెటాలియన్ కల్నల్ ఉమా శంకర్, సుబేదార్‌లు సోహన్ లాల్, కృషన్ జ్యోతి, హవల్దార్‌లు ముకేష్ కుమార్, జితేంద్ర సింగ్, పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న గుంటూరులో ట్రాక్టర్ల ర్యాలీ



ట్రాక్టర్ల ర్యాలీ పోస్టరు ఆవిష్కరణ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి పిలుపు ప్రకారం ఈనెల 26న గుంటూరులో జరిగే ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఆదివారం రూరల్ మండల గ్రామం జగ్గడిగుంటపాలెంలోని కృష్ణుడి గుడి సెంటర్లో ట్రాక్టర్ల ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దుచేసిందని గుర్తుచేశారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల రుణాలను రద్దుచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లురద్దుచేసి, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించటాన్ని రైతాంగం వ్యతిరేకిస్తోందని చెప్పారు. అన్ని పంటలకు బీమా పథకం అమలుచేయాలనీ, ఆరవై ఏళ్ల నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.5 వేలు పింఛను మంజూరు చేయాలని, మోదీ ప్రభుత్వం 48 వేలమంది రైతులపై పెట్టిన అక్రమ కేసులను రద్దుచేయాలని కోరుతూ ఈనెల 26న గుంటూరులో జరిగే ట్రాక్టర్ ర్యాలీలో రైతులు భారీసంఖ్యలో పాల్గొనాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు ములకా శివకుమారి, కరేటి వెంకటరమణ, తాటి వెంకటేశ్వర్లు, దొడ్డక మల్లికార్జునరావు, దొడ్డక సూర్యానారాయణ, నల్లమేకల నాగేశ్వరరావు, కుర్రా సాంబశివరావు, కుర్రా పున్నారావు, పెరుగు గోపీ, నక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.